

ఒకటో నంబరు వినాయకుడి శోభాయాత్రలో కాషాయజెండాతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్


టవర్ సర్కిల్‌లో భక్తుల సందడి

మానకొండూర్ లో వినాయకుడి నిమజ్జనం


టవర్ సర్కిల్ వద్ద వినాయకుడికి పూజలు చేస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, కలెక్టర్ తదితరులు

వినాయకా.. సెలవిక..

● జిల్లాలో ఘనంగా నిమజ్జనోత్సవం ● నేత్ర పర్వంగా శోభాయాత్రలు ● భక్తి పారవశ్యంలో భక్తులు


కొత్తపల్లిలో చిన్ని వినాయకుడితో చిన్నారి

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 16: గణపతి బొప్పా మోరియా.. జై గణేశ.. బోలో గణేశ్ మహరాజ్ కీ జై.. అంటూ భక్తుల ఆనందోత్సాహాల మధ్య సోమవారం నిమజ్జనోత్సవం జిల్లాలో ఘనంగా సాగింది. జిల్లా వ్యాప్తంగా జరిగిన వేడుకల్లో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచే మండపాల వద్ద ఉద్వాసన పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆయా ఉత్సవ కమిటీల సారథ్యంలో వాహనాలను విద్యుద్దీపాలతో, రంగురంగుల పూలతో అలంకరించి విఘ్నేశ్వరులను నిలిపారు. లక్కీ డ్రాలు, లడ్డూ వేలాలు నిర్వహించగా భక్తులు ఉత్సాహంగా పాల్గొని బహుమతులు, పలు వస్తువులు, లడ్డూలు చేజిక్కించుకున్నారు. పలు ప్రాంతాల్లో, వీధుల్లో స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు, యూత్ క్లబ్‌ల ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు. నిమజ్జన యాత్ర జోరుగా హోరుగా కొనసాగింది. రాత్రి వరకు నిమజ్జనం కొనసాగగా చెరువుల్లో, నదుల్లో వినాయక మూర్తులను నిమజ్జనం చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రతిమలను టవర్‌సర్కిల్, రాంనగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నిమజ్జనోత్సవ వేదికల ద్వారా పూజలు జరిపి మానకొండూర్, కొత్తపల్లి, చింతకుంట జలాశయాల్లో నిమజ్జనం చేశారు. ఆయా ప్రాంతాలన్నీ విఘ్నేశ్వర నామస్మరణలతో మారుమోగింది. భక్తులు భక్తిపారవశ్యంలో మునిగి తేలారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి మండపం వద్ద పోలీసులను నియమించి విగ్రహాలు నిమజ్జనానికి తరలేట్లు చూశారు. పలుచోట్ల పోలీసులు ట్రాఫిక్ మళ్లించి నిమజ్జనానికి మార్గం సుగమం చేశారు. పలు కీలకప్రాంతాల్లో పికెటింగ్‌లు ఏర్పాటు చేసి జాగ్రత్తలు తీసుకున్నారు. టవర్‌సర్కిల్ వద్ద నుంచి ఒకటో నెంబర్ వినాయకుడు నాయకులు, అధికారుల చేతులమీదుగా పూజలందుకొని తరలగానే వెనువెంట వినాయకమూర్తులు నిమజ్జనోత్సవానికి తరలివెళ్లాయి. సీపీ అభిషేక్ మహంతి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. టవర్‌సర్కిల్ వద్ద కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, మేయర్ యాదగిరి సునీల్‌రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్‌లు లక్ష్మీకిరణ్, ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, ఆర్డీవో కుందారపు మహేశ్ పూజలు నిర్వహించారు.


మహాశక్తి ఆలయంలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ దంపతుల పూజలు


శోభాయాత్రలో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

● ఒకటో నంబరు వినాయకుడి వద్ద బండి సంజయ్ పూజలు

నగరంలోని పాతబజార్ ఒకటో నంబరు వినాయకుడి వద్ద కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పూజలు నిర్వహించారు. కాషాయ ధ్వజాన్ని చేత బూని వాహనం ముందు కొంత దూరం నడిచి అందరినీ ఉత్సాహపరిచారు.కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, నిర్వాహకులు పాల్గొన్నారు.

● మహాశక్తి ఆలయంలో...

మహాశక్తి ఆలయంలో ప్రతిష్ఠించిన వినాయకుడి వద్ద కేంద్ర మంత్రి బండి సంజయ్ పూజలు జరిపారు. అనంతరం ట్రాక్టర్‌ను నడిపారు.

● రూ. 1.25 లక్షలు పలికిన లడ్డూ

నగరంలోని రాంనగర్‌లో ఛాలెంజ్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడి వద్ద కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ గ్రామానికి చెందిన వేల్పుకొండ రాజ్‌కుమార్‌యాదవ్ 1,25,016రూపాయలకు లడ్డూ చేజిక్కిచ్చుకున్నారు. కోతిరాంపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన వినాయకుని మండపం వద్ద నిమజ్జనంలో భాగంగా సోమవారం కొరివి కిషన్ 50 వేల రూపాయలకు లడ్డూ చేజిక్కించుకున్నారు.


హుజూరాబాద్‌లో గణపతి నిమజ్జనంలో మున్సిపల్ చైర్‌పర్సన్, అధికారులు


చింతకుంట కెనాల్‌లో క్రేన్‌తో వినాయక విగ్రహాల నిమజ్జనం

● గణేష్ నిమజ్జనానికి పటిష్ఠ బందోబస్తు


పోలీస్ కంట్రోల్‌రూం నుంచి సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న సీపీ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 16 : కరీంనగర్‌లో గణేష్ నిమజ్జనానికి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేసి, సీసీ కెమెరాల పర్యవేక్షణలో శోభాయాత్ర నిర్వహిస్తున్నామని సీపీ అభిషేక్ మొహంతి తెలిపారు. కమిషనరేట్ కేంద్రంలోని జాన్ విల్సన్ హాల్‌లో గణేష్ నిమజ్జన బందోబస్తులో పాల్గొనే అధికారులతో సోమవారం పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జన కేంద్రాలయిన మానకొండూరు చెరువు, చింతకుంట కెనాల్, కొత్తపల్లి చెరువుతోపాటు, గణేష్ శోభాయాత్ర జరిగే రూట్‌ల లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి స్థాయిలో బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద, ఇతర ముఖ్యమైన చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పోలీస్ కంట్రోల్ రూమ్ ద్వారా వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. సున్నితమైన ప్రాంతాల్లో రూఫ్ టాప్‌లో బందోబస్తు ఏర్పాటు చేశామని సీపీ తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది అంతా నిమజ్జన కార్యక్రమం ముగిసే వరకు అప్రమత్తంగా వుంటూ విధులు నిర్వహించాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జన కార్యక్రమం జరిగేలా బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎవరైనా నియమాలు ఉల్లంఘించి ప్రజా శాంతికి భంగం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఎ లక్ష్మీనారాయణ, ఏసీపీలు శ్రీనివాస్, నరేందర్, కాశయ్య, మాధవి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన ఏర్పాట్లు భేష్

● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

మానకొండూర్, సెప్టెంబరు 16: మానకొండూర్, చింతకుంట, కొత్తపల్లిలో అధికారులు చాలా బాగా ఏర్పాట్లు చేశారని కేంద్ర హోం శాఖ సహయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రశంసించారు. మానకొండూర్‌లో చెరువు కట్ట వద్ద ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జనాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నవరాత్రులను పురస్కరించుకుని ధార్మిక వాతావరణంలో పండుగను జరుపుకుంటున్నామన్నారు. నవరాత్రుల్లో పాల్గొన్న హిందూ బంధువులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


జమ్మికుంట నాయిని చెరువులో వినాయకుడి నిమజ్జనం


వీణవంక మండలం నర్సింగాపూర్‌లో మహిళల కోలాటం


కొత్తపల్లిలో మహిళల నృత్యాలు


టవర్ సర్కిల్‌లో విద్యార్థినుల నృత్యాలు


కొత్తపల్లి చెరువులో వినాయకుడి నిమజ్జనం


మానకొండూర్ చెరువు వద్ద నిమజ్జనంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి


శ్రీరామ హనుమాన్‌నగర్‌కాలనీ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో వినాయక పూజలు


సైదాపూర్ మండలం జాగీర్‌పల్లిలో వినాయకుడి ఊరేగింపు

మత్స్యకారుడికి చిక్కిన భారీ చేప



28కిలోల చేపతో మత్స్యకారుడు తిరుపతి

తిమ్మాపూర్,సెప్టెంబరు16: తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లి మోయతుమ్మెద వాగులో ఓ మత్స్యకారుడి వలకు 28కిలోల చేప చిక్కింది. తిమ్మాపూర్ మండలం సంగంపల్లికి చెందిన తిరుపతి అనే మత్స్యకారుడు సోమవారం కొత్తపల్లి గ్రామం వద్ద లోయర్ మానేరు డ్యాం బ్యాక్ వాటర్ విస్తరించి ఉన్న మోయతుమ్మెద వాగులో వలతో చేపలు పడుతుండగా 28కిలోల బొచ్చె వలకు చిక్కింది. భారీ చేప వలకు చిక్కడంతో తిరుపతి సంతోషం వ్యక్తం చేశాడు. ఈ చేప ధర సుమారు 5వేల రూపాయల వరకు ఉంటుందని స్థానిక మత్స్యకారులు తెలిపారు. ఇటీవల పుష్కలంగా వర్షాలు పడటంతో జలాశయాలలో మత్సకారులకు భారీ చేపలు దొరుకుతున్నాయి. ఇంత పెద్ద చేప ఈ ప్రాంతంలో దొరకడం అరుదైనదిగా వారు పేర్కొంటున్నారు.

10 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న బియ్యం ట్రక్కు

కోల్‌సిటీ, సెప్టెంబరు 16: గోదావరిఖని 2ఏ మోరీ సమీపంలో వన్‌టౌన్ క్రైమ్ పార్టీ పోలీసులు 10టన్నుల బియ్యాన్ని ఆదివారం రాత్రి పట్టుకున్నారు. రామగిరి మండలం బేగంపేట కేంద్రంగా రేషన్ బియ్యంను మహారాష్ట్రకు రవాణా చేస్తున్నారు. రేషన్‌షాపులు, గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి సేకరించిన బియ్యాన్ని దర్జాగా తరలిస్తున్నారు. ఈ తరలింపునకు ట్రక్కులే కొనుగోలు చేశారు. ఆదివారం రాత్రి బేగంపేట నుంచి మహారాష్ట్రకు ట్రక్కులో రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు గోదావరిఖని 2ఏ మోరీ సమీపంలో వన్‌టౌన్ క్రైమ్ పార్టీ పోలీసులు అడ్డుకున్నారు. టీఎస్22 టీఏ1431 ట్రక్కులో 10టన్నుల రేషన్ బియ్యం, రేషన్ బియ్యం సరఫరాకు సివిల్ సప్లై వాడే గోనె సంచులు కూడా దొరికినట్టు తెలుస్తోంది. ట్రక్కును వన్‌టౌన్‌కు తరలించి ట్రక్కులో ఉన్న వారిని అదుపులోకి తీసుకున్నారు. రెండు నెలల క్రితం కూడా బేగంపేటకు చెందిన రేషన్ బియ్యం మాఫియా మహారాష్ట్రకు తరలిస్తుండగా ట్రాలీలను పోలీసులు పట్టుకున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలి

- కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి ఎస్జీటీ యూనియన్ వినతి

కరీంనగర్ టౌన్/భగత్‌నగర్, సెప్టెంబరు 16: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలని కోరుతూ సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర శాఖ బాధ్యులు సోమవారం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎస్జీటీ రాష్ట్ర అధ్యక్షుడు కరివేద మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం, మధుసూదనరావు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరాం శ్రీనివాస్, ప్రవీణ్, శ్రీధర్‌రెడ్డి, శాంతికిరణ్, శశిధర్, విజేందర్‌రెడ్డి, శేఖర్, మండల బాధ్యులు తదతరులు పాల్గొన్నారు.

ఇంజనీర్స్ డే వేడుకలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 16: భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని కాశేశ్వరి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్‌డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఇంజనీర్లను వారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కంది జ్యోతి, కస్తూరి భారతి, సిద్ది సరిత, కొండ రాధిక, రాగి వందన, కొండూరి రాధిక, చింతల లావణ్య పాల్గొన్నారు.

● బొమ్మకల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పలవురు ఇంజనీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి బట్టు రాజేందర్, జోన్ చైర్‌పర్సన్ చింతల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద



జగిత్యాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోకి సోమవారం వరద నీరు రావడం తగ్గింది. ఎస్సారెస్పీలోకి 10,465 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 10,465 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

అటవీ శాఖ అధికారులకు నెమలి అప్పగింత



అధికారులకు నెమలిని అప్పగిస్తున్న యువకుడు

చందుర్తి, సెప్టెంబరు 16 : చందుర్తి మండలం బండపల్లిలో చెరువు ప్రాంతంలో కాలుకు గాయమైన జాతీయపక్షిని గ్రామానికి చెందిన యువకులు రక్షించారు. కాలుకు గాయమై ఇబ్బంది పడుతున్న నెమలిని గమనించిన నాగరాజు, వేణు, మణిసాగర్ అటవీశాఖ సెక్షన్ అధికారి అన్వర్ హుస్సేన్‌కు సమాచారం ఇచ్చారు. అనంతరం దానికి వైద్యం చేసి అటవీశాఖ అధికారులకు అప్పగించగా అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

భూ వివాదం పరిష్కరించాలని సెల్ టవర్ ఎక్కిన వ్యక్తి



సెల్ టవర్ ఎక్కిన పొన్నాలు

చందుర్తి సెప్టెంబరు 16: తన సోదరుడితో కొన్ని సంవత్సరాలుగా భూ వివాదం నడుస్తోందని, సమస్య పరిష్కరించే న్యాయం చేయాలని ఓ వ్యక్తి పురుగుల మందు డబ్బాతో చందుర్తి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట సెల్ టవర్ ఎక్కాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఆశిరెడ్డిపల్లికి చెందిన బొజ్జ గట్టు పొన్నాలుకు అతడి తమ్ముడు మోహన్‌తో భూ వివాదం కోర్టులో ఉంది. సమస్య పరిష్కారం కావడం లేదని, తనకు న్యాయం చేయాలని పురుగుల మందు డబ్బాతో చందుర్తి చేరుకొని సెల్ ఎక్కాడు. ఆత్మహత్య చేసుకుంటానని పేర్కొనడంతో సీఐ వెంకటేశ్వర్లు న్యాయం చేస్తామని, సెల్‌టవర్ దిగి రావాలని సూచించారు. దీంతో టవర్ దిగి వచ్చాడు.

'నవోదయ' ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

చొప్పదండి, సెప్టెంబర్ 16 : జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష దరఖాస్తు గడువును పెంచినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునే గడువు ఈ నెల 16నుంచి 23 వరకు విద్యాలయ సమితి పెంచినట్లు ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



చింతల గుట్ట నుంచి తవ్విన మట్టి



మట్టిని టిప్పర్లలో నింపుతున్న ఎక్స్‌కవేటర్



తవ్వి తొలగించిన బండరాళ్లు

తోడేస్తున్నారు..

● అనుమతులు లేకుండా మట్టి తరలింపు ● కరుగుతున్న గుట్టలు ● పట్టించుకోని అధికారులు

తిమ్మాపూర్, సెప్టెంబరు 16 : తిమ్మాపూర్ మండలంలోని గుట్టలను ప్రభుత్వ అనుమతులు లేకుండా తవ్వి కొందరు యథేచ్ఛగా మట్టిని విక్రయిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో కొద్ది రోజులుగా ఈ దందా బహిరంగంగానే కొనసాగుతోంది. తిమ్మాపూర్ మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పట్టా భూమి, గుట్టలు అంటూ చూడకుండా కొందరు ఇష్టారీతిలో అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రామకృష్ణ కాలనీ గ్రామ శివారు చెర్లపల్లిలో చింతలగుట్టను ధ్వంసం చేస్తూ కొన్ని రోజులుగా జేసీబీలతో మట్టి తీసి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకున్నా ఒక టిప్పర్‌కు 2,800 నుంచి 3వేల రూపాయల చొప్పున మట్టి విక్రయిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండిపెడుతున్నారు. చింతలగుట్ట పట్టా భూమి అని అది ఉల్లెంగుల ఏకానందం అనే వ్యక్తికి సంబంధించిన భూమి అని అతని అనుమతితోనే మట్టి తవ్వకాలు జరుపుతున్నట్లు అక్కడ ఉన్న వ్యక్తులు తెలిపారు. పట్టా భూమి అయినా మట్టి తవ్వకాల కోసం ప్రభుత్వ అనుమతులు తీసుకోవాల్సి ఉండగా ఇవేవీ వీరు పట్టించుకోక పోవడంతో పాటు ఇష్టారీతిలో తవ్వకాలు చేపడుతున్నారు. పట్టా భూమిలోని మట్టిని పెద్ద ఎత్తున ఇతర ప్రాంతాలకు తరలించాలంటే ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని అధికారులు తెలిపారు. తవ్వకాలకు సంబంధించిన వ్యక్తి ఏకానందం తన భూమి తన ఇష్టం అని అధికారులను తాను చూసుకుంటు న్నానని చెప్పడం గమనార్హం. మట్టి తవ్వకాలకు, మట్టి విక్రయాలకు ఎవరి అనుమతి అవసరం లేదని తన భూమి తనఇష్టం అని ఆయన పేర్కొన్నాడు. అధికారులకు సమాచారం అందడంతో మట్టి తవ్వకాలు నిలిపివేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చరిత్రను కనుమరుగు చేస్తున్నారు

● కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, సెప్టెంబరు 16 : ప్రజా పాలన పేరుతో తెలంగాణ చరిత్రను కనుమరుగు చేస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. కరీంనగర్‌లో ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎవరికి భయపడి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిజాంపై పోరాడి ప్రాణాలర్పించిన వారి త్యాగాలను అవమానిస్తున్నారన్నారు. అందుకే తెలంగాణ ప్రజా పాలన కార్యక్రమాలకు హాజరు కావడం లేదన్నారు. కాంగ్రెస్‌కు చేతనైతే తెలంగాణ విమోచన దినోత్సవం పేరుతో ఉత్సవాలు నిర్వహిస్తే తప్పకుండా హాజరవుతామన్నారు. కేంద్రం పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ విమోచన దినోత్సవానికి హాజరు కావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. సర్దార్‌పటేల్ పోలో ఆపరేషన్‌తోనే నిజాం పాలన నుంచి తెలంగాణకు విముక్తి లభించిందన్నారు. ఎంఐఎం పార్టీకి బయపడి ఒక వర్గం ఓట్లకోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించకుండా ప్రజలను వంచిస్తున్నాయన్నారు. రజాకార్ పార్టీ వారసుడు ఓవైసీ ప్రభుత్వ భూములను కబ్జాచేసి పేదలను దోచుకుంటున్నాడని బండి సంజయ్ ఆరోపించారు. అలాంటి ఓవైసీ ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కూల్చ కుండా ఓవైసీకి వంతపాడుతున్నారన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే హైదరాబాద్‌లో పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. సర్దార్ పటేల్ మాకు వీరుడే అని, పటేల్ వారసులం మేమే అని అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల అమలుపై దృష్టి మరల్చేందుకే రాజీవ్ విగ్రహం తెరపైకి తెచ్చారన్నారు. ఖాళీగా ఉన్న కేసీఆర్ కుటుంబానికి ఢిల్లీ సీఎం పదవి ఇచ్చేందుకే కేజ్రీవాల్ రాజీనామా చేశారేమోనని ఎద్దేవా చేశారు. వారిద్ద రిది లిక్కర్ బంధమన్నారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణలో నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనంపై రాష్ట్ర ప్రభుత్వం గణేష్ ఉత్సవ కమిటీతో చర్చించి అనుకూలమైన నిర్ణయం తీసుకోవాలన్నారు. హిందు పండుగలపై వివక్ష చూపుతున్నారనే భావన ఉందన్నారు. నరేంద్రమోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించు కుని పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించాలని బండి సంజయ్ అన్నారు.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య

కొడిమ్యాల, సెప్టెంబరు 16 : మండలంలోని రామకిష్టాపూర్ గ్రామానికి చెందిన మామిడి చంద్రయ్య (52)అనే వ్యక్తి మతి స్థిమితం సరిగా లేక ఆదివారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ అర్జరాజు సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు చంద్ర య్య ఆర్థికంగా ఇబ్బందులపాలై, మద్యానికి బాని సయ్యాడు. దీంతో మతిస్థిమితం సరిగా లేక ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. చంద్రయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర యోగా ఛాంపియన్‌గా ఉమ్మడి జిల్లా జట్టు



ఛాంపియన్ షిప్‌ను అందుకుంటున్న ఉమ్మడి జిల్లా జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 16: తెలంగాణ రాష్ట్రస్థాయి యోగాసన ఛాంపియన్ షిప్‌ను ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు సాధించింది. ఈనెల 14, 15 తేదీల్లో హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో ఉమ్మడి జిల్లాజట్టు 116 పాయింట్లు సాధించి మొదటి స్థానంతో పాటు ఓవర్‌ఆల్ ఛాంపి యన్ షిప్‌ను అందుకుంది. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకా రులు 7బంగారు, 4 రజత, 4 కాంస్య పతకాలతో పాటు 5వ స్థానంలో నలుగురు, 6వ స్థానంలో ఆర్గురు క్రీడాకా రులు నిలిచి కప్పును కైవసం చేసుకున్నారు. అలాగే ఉమ్మడి జిల్లా క్రీడాకారులు రాష్ట్రంలోనే అత్యధికంగా 16 మంది జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఛాంపియన్స్‌గా నిలిచిన జిల్లా జట్టును జిల్లా యోగా సంఘం అధ్యక్ష కార్యదర్శులు సర్దార్ రవీందర్‌సింగ్, నాగిరెడ్డి సిద్ధారెడ్డి, డీవైఎస్ఓ శ్రీనివాస్‌గౌడ్, యోగా సంఘం ఉపాధ్య క్షుడు కన్న కృష్ణ, కోచ్‌లు రామకృష్ణ, వి కిష్టయ్య, మల్లేశ్వరి, స్వరూపాచారి, మనోజ్‌కుమార్, విజయ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

జిల్లా జైలులో గాంధీ విగ్రహం ఆవిష్కరణ



గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జైళ్ల శాఖ డీఐజీ సంపత్

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 16 : కరీంనగర్ జిల్లా జైలు ఆవరణలో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని సోమవారం జైళ్లశాఖ డీఐజీ ఎం.సంపత్ ఆవిష్కరించారు. జిల్లా జైలును వరంగల్ రేంజ్ డీఐజీ (డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్‌ప్రిజన్స్) ఎం.సంపత్ సంవత్సర తనిఖీలో భాగంగా సందర్శించారు. జైలులో ఖైదీల యోగ క్షేమాలను, భోజన వసతులు, న్యాయసేవా, ఆరోగ్యసమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. తరువాత జైలులో కాంటీన్, జైలు ఆసుపత్రి ములాఖత్, ఫోన్ సౌకర్యం, లైబ్రరీ, ఖైదీల టాయిలెట్లు, శుభ్రత, వంటశాల, జైలు ఇండస్ట్రీ, పెట్రోల్ బంకులలో పని తీరును తెలుసుకుని అధికారులను అభినందించారు. జైలులోని గార్డెనింగ్ నిర్వహణ, పరిశుభ్రత బాగుందని అధికారులను అభినందించారు. మహిళా జైలును కూడా డీఐజీ సందర్శించారు. అనంతరం జైలు క్వార్టర్‌లో శ్రీ విఘ్నేశ్వర స్వామి పూజలో డీఐజీ పాల్గొన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ శ్రీనివాస్, వైద్యాధికారి వేణు గోపాల్, జైలర్స్ శ్రీనివాస్, రమేష్, పర్శ రామ్, డిప్యూటీ జైలర్స్ శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రమేష్ సుధాకర్ రెడ్డి, సంగీత పాల్గొన్నారు.

ఇద్దరు చిన్నారులపై కుక్కల దాడి

బీర్‌పూర్,సెప్టెంబరు 16 : బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో ఇద్దరు చిన్నారులపై వీధి కుక్కలు సోమవారం దాడి చేశాయి. గ్రామంలోని చెందిన పోతు రమేష్ కుమారుడు రాణా(9), బొమ్మి డి శశిధర్ కూతురు అధ్యశ్రీ(4) అనే చిన్నారులు వారి ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా వీధికుక్కలు ఇద్దరు చిన్నారులపై దాడి చేసి తీవ్రంగా గాయ పరిచాయి. పిల్లల అరుపులు విన్న రాణా తల్లి గమనించి కుక్కల దాడి నుంచి పిల్లలను రక్షించారు. వెంటనే చిన్నారులను ఆసుపత్రికి తరలించారు.



గేట్లు ఎత్తడంతో కిందకు వస్తున్న నీరు

ఎల్‌ఎండీ గేట్లు ఎత్తిన అధికారులు

తిమ్మాపూర్, సెప్టెంబర్ 16 : ఎల్‌ఎండీ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో పాటు మధ్యమానేరు నుంచి సుమారు 3వేల క్యూసెక్కుల నీరు వస్తుండటంతో ఎల్ఎండీ జలాశయం ప్రధానగేట్లు సోమవారం ఉదయం 9.30 గంటలకు ఇరిగేషన్ ఎస్ఈ పెద్ది రమేష్ ఆధ్వర్యంలో అధికారులు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. అనంతరం నీటిలో ఇరిగేషన్ అధికారులు పూలుజల్లి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ పెద్ది రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం లోయర్ మానేర్ డ్యాంలో 23.90 టీఎంసీల నీరు ఉందని ఎగువ ఎంఎం ఆర్ నుంచి 3వేల క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి వస్తుండటంతో రెండు గేట్లు ఎత్తి 3వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ పెద్ది రమేష్, ఈఈ నాగభూషణం, డీఈ శ్రీనివాస్, ఏఈఈలు కాళిదాస్, వంశీధర్, అంజుమునీసా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రెండు గంటల తర్వాత తిరిగి మూసివేత

ఎస్సారెస్పీ నుంచి ఇన్‌ఫ్లో తగ్గడంతో ఎంఎంఆర్ నుంచి మూడు వేల క్యూ సెక్కు లు ఎల్ఎండిలోకి విడుదల చేశారు. దీంతో అధికారులు 11.30 గంటల సమయంలో గేట్లు మూసివేశారు. అనంతరం కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదలను మూడువేల క్యూసెక్కులకు పెంచారు. ఎల్ఎండీ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.947 టీఎంసీల నీరు ఉంది. ఇన్‌ఫ్లో 4,732, ఔట్‌ఫ్లో 3,309 క్యూసెక్కులు ఉంది.

'నవోదయ'లో ముగిసిన కళోత్సవాలు



విద్యార్థుల ప్రదర్శనలు

చొప్పదండి, సెప్టెంబర్ 16 : చొప్పదండి జవహర్ నవోదయ విద్యాలయంలో కళోత్సవాలు సోమవారం ముగిశాయి. ఆదివారం ఉత్సవాలు ప్రారంభం కాగా రెండు రోజుల పాటు ఘనంగా జరిగాయి. తెలంగాణ క్లస్టర్ స్థాయిలోని తొమ్మిది జిల్లాల నవోదయ విద్యాలయాల నుంచి విద్యార్థులు ఈ ఉత్సవాలకు హాజరై వివిధ పోటీలలో పాల్గొన్నారు. నల్లగొండ విద్యాలయం వోకల్ మ్యూజిక్, నృత్యంలో నాగర్‌కర్నూల్, కరీంనగర్ ఇన్‌స్ట్రు మెంటల్, నిజామాబాద్ స్టోరీ టెల్లింగ్, మెదక్ విద్యాలయం విజువల్‌ఆర్ట్స్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంగతాయారు, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్రైం కార్నర్

సింగరేణి కార్మికుడి అనుమానాస్పద మృతి

- ఒంటిపై తీవ్రగాయాలు
- నెల రోజుల్లో పదవీవిరమణ
- మృతిపై అనేక సందేహాలు
- మార్చురీకి తరలించిన పోలీసులు

కోల్‌సిటీ, సెప్టెంబరు 16 : గోదావరిఖని ఐబీ కాలనీలో నివాసముండే సింగరేణి కార్మికుడు బానోత్ హరిసింగ్(60) సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అతని గొంతు, చాతి, కాళ్లపై గాయాలున్నాయి. హరిసింగ్ కుటుంబం ఐబీ కాలనీలోని క్వార్టర్ నంబర్ 612లో నివాసముంటున్నది. అతనికి భార్య దస్లి, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురుకు కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. హరిసింగ్ మెడికల్ అన్‌ఫిట్‌కు ప్రయత్నించగా అన్‌ఫిట్ కానట్టు తెలుస్తోంది. నెలరోజుల్లో పదవీ విరమణ ఉన్నట్టు సమాచారం. సోమవారం సాయంత్రం హరిసింగ్ భార్య దస్లి బయటకు వచ్చి తన భర్త పరిస్థితి విషమంగా ఉందని స్థానికులకు చెప్పడంతో వారు గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అతడు మృతి చెందినట్టు వైద్యులు పేర్కొన్నారు. మృత దేహంపై గాయాలు ఉండటంతో వన్ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. హరిసింగ్ మృతిపై అనుమానాలు ఉండడంతో మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు.

● గుర్తు తెలియని వ్యక్తుల సంచారం..

సోమవారం మధ్యాహ్నం నుంచి హరిసింగ్ ఇంటి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు సంచారంతో స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గణపతులు వచ్చిన సమయంలో ఇద్దరు వ్యక్తులువచ్చి వెళ్లారని, కొద్దిసేపటికే హరిసింగ్ మృతి చెందారనే చర్చ జరుగుతోంది.

● మృతిపై అనుమానాలున్నాయి...

- వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి

గోదావరిఖని ఐబీకాలనీలో హరిసింగ్ మృతిపై అనుమానాలున్నాయి. మృతదేహాన్ని మార్చురీకి తరలించాం. దీనిపై దర్యాప్తు చేస్తున్నాం. మంగళవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తాం.

పోలీస్ సైరన్‌తో తిరుగుతున్న వాహనం సీజ్

ఇల్లంతకుంట, సెప్టెంబరు 16 : పోలీస్ సైరన్ వాహనానికి అమర్చుకొని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. సోమారంపేట గ్రామానికి చెందిన వంగ శ్రీనివాస్ తన డ్రైవర్ పల్మారి శ్రీనివాస్‌తో కలిసి నిబంధనలకు విరుద్ధంగా కారుకు పోలీస్ సైరన్ అమర్చుకున్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా గ్రామానికి హెడ్‌కానిస్టేబుల్ దేవేందర్ వెళ్లగా సైరన్ బిగించిన వాహనాన్ని గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇద్దరిపై కేసున మోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 16 : ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ మంటలు అంటుకుని తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్న వృద్ధురాలు సోమవారం మృతి చెందింది. పట్టణంలోని పద్మనగర్ ప్రాంతానికి చెందిన సింగం సుగుణ(80) అనే వృద్ధురాలు ఆదివారం తన ఇంటిలో వంట చేస్తున్న సమయంలో ప్రమాదావశాత్తు గ్యాస్ సిలిండర్ మంటలు అంటుకుని తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అదే రోజు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సుగుణ సోమవారం మృతి చెందింది. మృతుడి కుమారుడు గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసునమోదు చేసినట్లు వివరించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యవసాయ కూలీ ఆత్మహత్య

ఇల్లంతకుంట, సెప్టెంబరు 16 : రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని వెంకట్రావుపల్లెకు చెందిన ఏనుగుల ముత్తయ్య(33) అనే వ్యవసాయ కూలీ ఆర్థిక ఇబ్బందులతో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం .. ముత్తయ్య గ్రామంలో ఉపాధిలేక పోవడంతో రెండుసార్లు విదేశాలకు వెళ్లాడు. అక్కడా సరైన పని దొరకక ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో ముత్తయ్యకు రూ.3 లక్షల అప్పులు అయ్యాయి. అనంతరం ఇంటికి వచ్చి వ్యవసాయం చేసినా అప్పులు తీరలేదు. అప్పులు తీర్చేమార్గం కనిపించకపోవడంతో సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గుండారం గ్రామసమీపంలో సోమవారం చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

నేడు తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న మంత్రి శ్రీధర్‌బాబు

కరీంనగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం 17న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహిస్తోందని కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో జరిగే ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరై ఉదయం 9.40 నుంచి 9.50 గంటల వరకు తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద అమర వీరులకు నివాళులర్పిస్తారు. అక్కడి నుంచి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు చేరుకొని జాతీయ పతాకావిష్కరణ, జాతీయ గీతాలాపన చేస్తారు. 10.02 నుంచి 10.07 గంటల వరకు తెలంగాణ రాష్ట్ర గీతాలాపన, వందన స్వీకారం ఉంటుందన్నారు.

'ట్రినిటి'లో ఘనంగా ఫ్రెషర్స్ డే



నృత్యాలు చేస్తున్న ట్రినిటి కళాశాల విద్యార్థినులు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 16: నగరంలోని ట్రినిటి జూనియర్ కళాశాల గర్ల్స్ ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, ట్రినిటి కళాశాల వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన స్థానానికి చేరాలన్నారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ఎంపీసీ విభాగంలో 468,467/470, బైపీసీలో 438/440, 437/440, సీఈసీలో 487/500,ఎంఈసీలో 488/500మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో ట్రినిటి ఏసీ కళాశాల, ప్రైమ్ అకాడమి, ట్రినిటి భగత్‌నగర్, మేయిన్ క్యాంపస్ ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

నామమాత్రంగా రోడ్ల గుంతలు పూడ్చివేత

-లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం

- 'బల్దియా' తీరుపై నగరవాసుల ఆగ్రహం



శివ టాకీస్ సమీపంలో ప్యాచ్‌వర్క్ చేయకుండా వదిలేసిన రోడ్డు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 16: నగరంలో 60 డివిజన్లలో దెబ్బతిన్న రోడ్లు, ఏర్పడ్డ గుంతలను పూడ్చేందుకు చేపట్టిన మరమ్మతు పనులు అసంపూర్తిగా ఉన్నాయని నగర ప్రజలు విమర్శిస్తున్నారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా 50లక్షలతో తాత్కాలిక మరమ్మతు పనుల నిర్వహణ కోసం టెండర్లను ఈనెల మొదటివారంలో నిర్వహించారు. గత ఏడాది పండుగ ఏర్పాట్ల పనులను చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకపోవడంతో వారు ఈసారి పనులు చేయమంటూ మొండికేయడంతో అధికారులు ఒప్పించి వారికి పనులు అప్పగించారు. వినాయక చవితి పండుగ తర్వాత వారికి వర్క్‌ఆర్డర్లు ఇవ్వడంతో మూడు, నాలుగు రోజుల నుంచి మరమ్మత్తు పనులు చేస్తున్నారు. ఇప్పటికీ కొన్ని చోట్ల గుంతల పక్కన, రోడ్ల పక్కన డస్ట్ పోసి కనీసం దాని చదను చేయకుండా కుప్పగానే వదిలి పెట్టారు. జ్యోతినగర్ శివథియేటర్ ముందు ఒక గుంతను సిమెంట్ కంకరతో పూడ్చి, ఆపక్కనే ఉన్న కాలువను, గుంతను పూడ్చలేదు. బల్దియా ఇంజనీరింగ్ అధికారు తీరుపై నగర వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఓజోన్ పొరను కాపాడుకుందాం



మాట్లాడుతున్న మానేరు పర్యావరణ సమితి అధ్యక్షుడు తోట లక్ష్మణరావు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు16: ఓజోన్ పొరను కాపాడుకుందామని మానేరు పర్యావరణ సమితి అధ్యక్షుడు తోట లక్ష్మణరావు అన్నారు. ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా సోమవారం సర్వోదయ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలుష్యాన్ని తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహా సభ అధ్యక్షుడు కన్న కృష్ణ, వాసవి సేవా కేంద్రం అధ్యక్షుడు చిదుర సురేశ్, ప్రధాన కార్యదర్శి పెద్ది విద్యాసాగర్, పడకంటి శ్రీనివాస్, చిట్టుమల్ల కొండయ్య, పాత వేంకటనరసయ్య పెద్ది లక్ష్మీనారాయణ, గుడిసె రాజేంద్రప్రసాద్, నలుమాచు మనోహర్, జిల్లా అంజయ్య, జగదీశ్వర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

కరీంనగర్-2 డిపోలో ప్రగతి చక్ర అవార్డుల ప్రదానం

భగత్‌నగర్, సెప్టెంబరు 16: ఆర్టీసీ కరీంన గర్-2 డిపోలో డిపో మేనేజర్ మల్లయ్య అధ్యక్ష తన ఆగస్టు-2024 ప్రగతి చక్ర అవార్డులను ప్రదానం చేశారు. ప్రతిభ కనబరిచిన ఉద్యో గులను ఘనంగా సన్మానించారు. రాజయ్య, కె వినోద, ఆర్‌రామయ్య, వి రాజన్న, డిఎంరెడ్డి, కెబి రాజులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

వోపా కార్యవర్గ ప్రమాణ స్వీకారం



వోపా నూతన కార్యవర్గం

సుభాష్‌నగర్, సెప్టెంబరు16: జిల్లా విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ కార్యవర్గం సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. నగరంలోని ఒక ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా గద్దె సత్య నారాయణ, ప్రధాన కార్యదర్శిగా గాలిపెల్లి శంకరయ్య, కోశాధి కారిగా యాస్వాడ అంజయ్య, ఉపాధ్యక్షులుగా దుంపటపెల్లి లక్ష్మీనారా యణ, కట్ట నాగభూషణా చారి, సత్యనారాయణ, చిలు ముల వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శులుగా ఈరోజు భీష్మాచారి, తిప్పర్తి అంజయ్య, వడ్లూరి బ్రహ్మానందం, లింగంపేట సత్యన్న, కార్యనిర్వాహక కార్యదర్శిగా గాలిపెల్లి బ్రహ్మాచారి, సాంస్కృతిక కార్యదర్శిగా కందుకూరి రామానంద తీర్థ, కార్యవర్గ సభ్యులుగా రావుల చొక్కయ్య, గోవుల కొండ ముత్యం, వంగల సత్యనారాయణ, లోకోజు కమలాకర్, కట్ట రామకృష్ణ, కట్ట నాగభూషణం, కందుకూరి సత్యనారాయణతో వోపా రాష్ట్ర కన్వీనర్ వేముల వాడ ద్రోణాచారి ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో కట్ట విష్ణువర్ధన్, హరిహరాచారి, రావుల నిరంజనాచారి, గద్దె సత్యనారాయణ, సింహరాజు కోదం డరాములు, తిప్పర్తి రమేశ్, ఎర్రోజు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కరీంపేటలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు

శంకరపట్నం, సెప్టెంబరు 16: శంకరపట్నం మండలంలోని కరీంపేట గ్రామంలో మజీద్ మౌలాన మహ్మద్ సల్మాన్ రజా ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు గ్రామంలో ర్యాలీ నిర్వహించగా, వారికి గ్రామ ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మహ్మద్ ఖాజాపాషా, మజీద్ అధ్యక్షుడు మహ్మద్ అజీమోద్దీన్, సర్దార్, చాంద్‌పాషా, అఫ్జల్, జాకీర్, ఖాజా, జీవిద్, సమేద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గణనాథుడికి వీడ్కోలు



కొత్తపల్లి చెరువులో వినాయక నిమజ్జనం



కొత్తపల్లిలో నిమజ్జన వేడుకల్లో అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి



బిర్లా ఓపెన్‌మైండ్స్ స్కూల్‌లో నిమజ్జన వేడుకలు



శ్రీరాంనగర్‌కాలనీలో శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 16: జిల్లాలో వినాయక నిమజ్జనం సోమవారం ప్రశాంతంగా ముగిసింది. నగరంలోని మారుతి హెవెన్స్‌లో పర్యావరణ సమతుల్యతతో ఒక టబ్‌లో ఉంచి వినాయక నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అన్నవరం దేవేందర్, సింగిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోశాధికారి శ్రీనివాసాచారి, రవీందర్, వేంకటేశ్, మల్లయ్య, మల్లారెడ్డి, మహేశ్, గజపతి పాల్గొన్నారు. రాంనగర్ 37వ డివిజన్‌లో గణపతి నిమజ్జన ఉత్సవాలలో చిన్నారుల సంబరాలు అంబరాన్నంటాయి, కార్యక్రమంలో పరంకుశం శ్రీహర్ష, కుంట అచ్యుత్, తూము రవీందర్, కుంట సంపత్, రాజు, శ్రీనివాస్, అశోక్, శ్రీకాంత్ గిరి, వరాల దేవేందర్, శ్రీకాంత్, వినోద్, మహిళలు తూము ఉమాదేవి, పరంకుశం భారతి, కుంటా మాధవి, స్వప్న, అలేఖ్య, ప్రవీణ, నిర్మల, కవిత, కుంట వేదశ్రీ, నరేందర్, నరేష్ పాల్గొన్నారు. అచీవర్స్ యాక్టివ్ హైస్కూల్‌లో గణేశ్ నిమజ్జన ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పల్లవి పాల్గొన్నారు. అమెరికా దేశం టెక్సాస్‌లోని డల్లాస్‌లో సోమవారం జరిగిన నిమజ్జనోత్సవంలో మేయర్ సతీమణి అపర్ణా సునీల్‌రావు పాల్గొన్నారు.

●**భగత్‌నగర్:** అల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కొత్తపల్లి చెరువులో నిమజ్జనం చేశారు.

●రేకుర్తిలోని సాన్వి డిఫెన్స్ అకాడమి, జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన వినాయకున్ని కొత్తపల్లి చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ మునీందర్, ప్రిన్సిపాల్, డైరెక్టర్ సిరిపురం ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

●కొత్తపల్లిలో తూర్పు వాడ రెడ్డి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూ వేలంలో కలకొండ మల్లారెడ్డి (అభిలాష్‌రెడ్డి) 56,116రూపాయలకు దక్కించుకున్నారు. ఈకార్యక్రమంలో కంతాల మల్లారెడ్డి, మందల అమరేందర్‌రెడ్డి, బండ జగన్‌రెడ్డి, కలకొండ మురళీకృష్ణరెడ్డి, బండ హరికృష్ణ, మధు, రాజు తదితరులుపాల్గొన్నారు.

●**కరీంనగర్ రూరల్:** కరీంనగర్ మండలంలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. నగునూర్‌లో లక్ష్మీనరసింహాస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన గణేషునికి ప్రత్యేక పూజల అనంతరం గ్రామ శివారులోని పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. చెర్లబూత్కూర్‌లో కరీంనగర్ వ్యవసాయ సహకారం సఘం అధ్యక్షుడు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. బిర్లా ఓపెన్‌మైండ్స్ స్కూల్‌లో వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్‌లో అంజననగర్ యూత్ ఆధ్వర్యంలో గణపతి లడ్డూను వేలం వేయగా శ్రీమతి మ్యాకల పుష్పలత-శంకర్ గార్లు 26,116 రూపాయలకు కైవసం చేసుకున్నారు.

●**హుజూరాబాద్:** హుజూరాబాద్ పట్టణంలో వైభవంగా గణేష్ నిమజ్జనం జరిగింది. విద్యానగర్‌లోని వరసిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలు కోలాటంతో ఊరేగింపును నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జన ఉత్సవ ఆహ్వాన వేదిక ఏర్పాటు చేశారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులను సన్మానించి మెమెంటోలను అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ భారీ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

●**శంకరపట్నం:** మండల వ్యాప్తంగా కోలాటాలు, కీర్తనలు, భజనలు చేస్తూ డప్పుచప్పులతో వినాయకులను నిమజ్జనానికి తరలించారు.

●**సైదాపూర్:** మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో ప్రతిష్ఠించిన గణేష్ విగ్రహాలను సమీప చెరువులలో నిమజ్జనం చేశారు.

●**జమ్మికుంట:** జమ్మికుంట పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయకుడి నిమజ్జనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని నాయిని చెరువు వద్ద వినాయకుల నిమజ్జనం కోసం పాలకవర్గం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. క్రేన్ల ద్వారా వినాయకులను చెరువులో నిమజ్జనం చేశారు. కొత్తపల్లి కెనాల్, రామన్నపల్లి, ధర్మారం చెరువుల్లో వినాయకుల నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణ సీఐ వరంగంటి రవి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, సొసైటీ చైర్మన్ పొనగంటి సంపత్, కమిషనర్ ఎండి ఆయాజ్ సిబ్బంది పర్యవేక్షించారు.

●**వీణవంక:** మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

●**తిమ్మాపూర్:** మండలంలోని ఎల్‌ఎండీ కాలనీలో గల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడిని ఘనంగా నిమజ్జనానికి తరలించారు. శోభాయాత్రలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి గోపు మల్లారెడ్డి, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు మంచాల మహేందర్, పలకల శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి, పాశం లావణ్య, సంతోష్, దివ్య, రాజేశ్వరి, లక్ష్మీ, లక్ష్మణ్, శివ, శ్రీనివాస్, నాయకులు కనకం కుమార్, ఆశిక్ పాషా,రెడ్డి రాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

●**గంగాధర:** గంగాధరలో గణనాథుడి నిమజ్జన వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మంటపాల వద్ద లడ్డూ వేలం నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా ఎస్ఐ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

●**గన్నేరువరం:** మండలంలో వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మహిళలు, యువకులు, కోలాట నృత్యాలతో శోభాయాత్రను నిర్వహించారు. కొన్ని గ్రామాలలో మంగళవారం నిమజ్జనాన్ని చేయనున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ నరేష్ పోలీస్ సిబ్బందితో పర్యవేక్షించారు.

●**చొప్పదండి:** చొప్పదండిలో, మండలంలో గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది. నిమజ్జనం కోసం కాకతీయ కాలువ వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తును నిర్వహించారు.

●**మానకొండూర్:** మానకొండూర్ చెరువులో గణేష్ నిమజ్జనం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. మానకొండూర్‌లో తహసీల్దార్ రాజేశ్వరీ గణేష్ నిమజ్జనాన్ని ప్రారంభించారు. కరీంనగర్‌తో పాటు మండలంలోని మానకొండూర్, ముంజంపల్లి, శ్రీనివాస్‌నగర్ గ్రామాలకు చెందిన వేలాది విగ్రహాలను మానకొండూర్ చెరువులో నిమజ్జనం చేశారు.

●**రామడుగు:** మండలంలోని అన్ని గ్రామాల్లో నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. ఎస్ఐ శేఖర్ బందోబస్తు నిర్వహించారు. గోపాల్‌రావుపేట గ్రామంలోని హనుమాన్ గుడి వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో లడ్డూను గ్రామానికి చెందిన రాజిరెడ్డి 9,016 రూపాయలకు దక్కించుకున్నారు.



శంకరపట్నంలో గణనాథుల శోభాయాత్ర



ఎల్‌ఎండీలోని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి తరలుతున్న గణనాథుడు



గన్నేరువరంలో శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు



చొప్పదండిలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



రాంనగర్‌లో గణేష్ నిమజ్జనానికి బయలుదేరిన చిన్నారులు



గంగాధరలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

చట్టబద్ధమైన పని విధానాలు రూపొందించాలి

● కేంద్ర మంత్రికి మెడికల్ రిప్రజెంటేటివ్స్ వినతి

సుభాష్‌నగర్/భగత్‌నగర్, సెప్టెంబరు 16: దేశవ్యాప్తంగా పనిచేస్తున్న మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్‌కు చట్టబద్ధమైన పని విధానాలు రూపొందించాలని తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శులు జి విద్యాసాగర్, ఎ సదానందచారి కోరారు. ఈ మేరకు సోమవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2017, ఆగస్టు 10న కేవలం డ్రాఫ్ట్ రూల్స్ మాత్రమే రూపొందించిందన్నారు. దానిపై అభ్యంతరాలు తెలిపి ఏడు సంవత్సరాలు గడిచిన నేటికీ చట్టబద్ధమైన పనివిధానాలను రూపొందించలేదన్నారు. కార్మిక చట్టాల సవరణ పేరుతో కార్మికుల హక్కులను కాలరాజే నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని కోరారు. ఈ సమస్యలపై పార్లమెంట్‌లో గళం విప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుండా శ్రీనివాస్, కరీంనగర్ శాఖ అధ్యక్షుడు ఎ రమేశ్, ఎం అంజయ్య పాల్గొన్నారు.



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందచేస్తున్న మెడికల్ రిప్రజెంటేటివ్స్

వీధివ్యాపారులకు తోపుడుబండ్లు ఇవ్వడం అభినందనీయం

కరీంనగర్ టౌన్: రోటరీ క్లబ్ నిర్వాహకులు వీధివ్యాపారులకు చేయూతనిచ్చేందుకు తోపుడు బండ్లను ఉచితంగా ఇవ్వడం అభినందనీయమని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం నగరంలోని శ్రీమహాశక్తి దేవాలయ ఆవరణలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం పురస్కరించుకొని రోటరీ క్లబ్ ఆఫ్ కరీంనగర్, రోటరీ క్లబ్ ఆఫ్ మొయినాబాద్ సహకారంతో పది మంది వీధివ్యాపారులకు పది తోపుడు బండ్లను కేంద్రమంత్రి సంజయ్‌కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఇంజనీర్స్ డేను పురస్కరించుకొని ఇంజనీర్లు జీవీ కిషన్, పాక పావన కృష్ణ, కిరణ్‌కుమార్, అరవింద్, రామేందర్, రాజశేఖర్‌లను మంత్రి సంజయ్ సన్మానించారు.

విశ్వకర్మ భగవానుని బ్రహ్మోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 16: నగరంలోని కమాన్ చౌరస్తా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో జరుగుతున్న విశ్వకర్మ భగవానుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్థాపిత దేవతారాధనలు, మనుమయాది పంచబ్రహ్మలు, గాయత్రీ విశ్వకర్మ హోమం నిర్వహించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గొల్లపల్లి శ్రీనివాస్, ఈఓ వుడుతల వెంకన్న, ధర్మకర్తలు శ్రీరామోజు నాగరాజు, వేములవాడ రవీంద్రాచారి, మియాపురం వీరబ్రహ్మాచారి, అనసూరి రమేశ్, ముత్తోజు రామ్‌కుమార్, అస్తాపురం లీల తదితరులున్నారు.

మహమ్మద్ ప్రవక్త బోధనలు మానవాళికి దిక్సూచి

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 16: శాంతి, కరుణ, సోదర భావాన్ని చాటి చెప్పే మహమ్మద్ ప్రవక్త బోధనలు యావత్ మానవాళికి దిక్సూచి లాంటివని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లిం సోదరులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

● కరీంనగర్ కల్చరల్ : మహమ్మద్ ప్రవక్త చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని, వారి జీవితం యావత్ మానవాళికి మార్గదర్శకమని మౌలానా నూరిమియా మురాది బాది పిలుపునిచ్చారు. సోమవారం రాజీవ్‌చౌక్‌లో సున్ని మర్కజీ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు హాఫీజ్ సయ్యద్ మొయిజొద్దీన్ ఖాద్రి అధ్యక్షతన జరిగిన ఈద్ మిలాదున్నబి సదస్సులో ఆయన మాట్లాడారు. యువత, విద్యార్థులు ప్రవక్త జీవిత సూత్రాలను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జామియా మస్జీద్ అధ్యక్షుడు సయ్యద్ షా యూసుపొద్దీన్ ఖాద్రి రియాజ్, మౌలానా ఖయ్యూం జియాయి, మౌలానా అబుల్ కలాం మిస్బాహి, అయ్యూబ్ ఖాన్, హబీబ్ ఖాద్రి, అబ్బాస్, యూసుఫ్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎంపీ రాజేశ్వర్‌రావు జయంతి

హుజూరాబాద్, సెప్టెంబరు 16: హుజూరాబాద్ పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్ వద్ద మాజీ ఎంపీ సింగాపురం రాజేశ్వర్‌రావు జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు, అభిమానుల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి రాజేశ్వర్‌రావు కుమారులు వొడితెల కిషన్‌రావు, వొడితెల శ్రీనివాస్ రావు, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ మాజీ ఎంపీ రాజేశ్వర్‌రావు గల్లీ నుంచి ఢిల్లీ వరకు అందరితో కలివిడిగా మెదిలేవారన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో ఆయన చేసిన సేవలు అభినందనీయమన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

● హుజూరాబాద్‌రూరల్: మండలంలో సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం కళాశాల వ్యవస్థాపక చైర్మన్ వొడితల రాజేశ్వర్‌రావు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇంద్రనీల్, కళాశాల అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో డీన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ యోగేష్ పుండలిక్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ యోగేష్ పుండలిక్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతిఎన్‌సీసీ ఇంచార్జి మేజర్ డాక్టర్ కె. రవీంద్రబాబు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

స్నేహితుడికి ఆర్థికసాయం

గంగాధర, సెప్టెంబరు 16:స్నేహితుడికి వైద్యానికి తోటి స్నేహితులు ఆర్థికసాయం అందించారు. గంగాధర గ్రామానికి చెందిన సహీద్ పాషా గ్రామపంచాయతీ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుండగా ప్రమాదానికి గురై చేయి కోల్పోయాడు. సహీద్ పాషా స్నేహితులు సోమవారం రూ.18వేలను పోగు చేసి అందించారు. సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు మడ్లపల్లి గంగాధర్‌తో కలిసి బాధితుడికి అందించారు.

యూత్ సభ్యులకు టీ షర్ట్‌ల పంపిణీ

హుజురాబాద్‌రూరల్, సెప్టెంబర్ 16: మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన గరుడ యూత్ సభ్యులకు అదే గ్రామానికి చెందిన ఆకినపల్లి దయానా-ఆకాష్ దంపతులు టీ షర్టులను అందజేశారు. సుమారు 15 వేలు విలువ చేసే 30 టీ షర్టులను అందజేశారు.

న్యాయవాదులకు సన్మానం

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 16: లయన్స్ క్లబ్ బొమ్మకల్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులను సన్మానించారు. ప్రపంచ న్యాయవాద దినోత్సవం సందర్భంగా న్యాయవాదులు లయన్ వెంగల్‌దాస్ శ్రీనివాస్, లయన్ బట్టు రాజేందర్, లయన్ బట్టు వెంకటేష్ లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్‌పర్సన్ లయన్ చింతల కిషన్ పటేల్ క్లబ్ సెక్రటరీ బట్టు రాజేందర్ , మాచినేని చక్రధర్ పాల్గొన్నారు

సెట్‌బ్యాక్ లేకుండా ఇంటి నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 16: నగరంలోని డివిజన్ నెంబర్ 14 శ్రీనగర్‌కాలనీలోని సర్వేనెం బర్ 1011లో లోక్ అదాలత్ ద్వారా ఇద్దరు వ్యక్తులు 1399 గజాల స్థలాన్ని పంపిణీ చేసుకున్నారు. ఈ భూమిలో ప్రస్తుతం 12 ఫీట్ల దారి మాత్రమే ఉంది. ఇందులో ఒకరు 12 ఫీట్ల నుంచి నాలుగు ఫీట్లు సెట్ బ్యాక్ అయి తన ప్లాట్‌ను అమ్ముకోగా, మరొకరు సెట్‌బ్యాక్ లేకుండా ఇంటి నిర్మాణం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని, సెట్‌బ్యాక్ లేకుండా ఇంటి పనులు జరుగకుండా చూడాలని ఎం.జావిద్ హుస్సేన్ మున్సిపల్ అధికారులను కోరారు. దీనిపై గతంలో కూడా మున్సిపల్‌అధికారులకు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు.

కోరపల్లిలో ఉచిత వైద్య శిబిరం

జమ్మికుంట, సెప్టెంబర్ 16: జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలో జన వికాస సంస్థ ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహ ఆసుపత్రి సహకారంతో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బాల వికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన వైద్యులు డాక్టర్ నిక్కత్ ఉన్నారు.

'జనాభా లెక్క తేలాకే స్థానిక ఎన్నికలు'

కరీంనగర్ అర్బన్: రాబోయే రెండు మూడు నెలల్లో బీసీల జనాభా లెక్క తేలాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ప్రకటించడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు పేర్కొన్నారు.